
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

ప్రఖర ప్రజ్ఞ     సజల శ్రద్ధ


**సంకల్పం**

**సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదకులు

**కందర్ప రామచంద్ర**

**సంపుటి 6**

**సంచిక 6**

**సెప్టెంబర్ 2005**

పార్థివ శ్రావణం-భాద్రపద

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**

కూర్పు

**సుందర్ గ్రాఫిక్స్**


## ఏ ఆదర్శాన్ని ఎన్నుకోవాలి

శక్తి ఒక్కటే.

సాకారుడైన పరబ్రహ్మ దేవాభావంలో సీత, రాధ, సరస్వతి, లక్ష్మి, మహేశ్వరి మున్నగు వివిధ రూపాలలో ఉపాసకులచేత ఆరాధింపబడుతున్నాడు.

రామకృష్ణ పరమహంస ఆ దేవినే కాళీమాతగా పూజించారు. తన ప్రియశిష్యుడు నరేంద్రనాథునికి ఆ మాత దర్శనం చేయించారు.

శ్రీ అరవిందులు మహత్ చేతన రూపంలో అవతరిస్తున్న సావిత్రీ మహాశక్తిగా ఆ ఆదిశక్తిని వ్యాఖ్యానించారు. శ్రీమాత ద్వారా ఆ శక్తిని బహిరంగ జగత్తుకు చూపారు.

పరమపూజ్య గురుదేవులు ఆదిశక్తియొక్క జాజ్వల్యమానమైన మాతృస్వరూపాన్ని మనముందుంచారు. స్నేహం,మమత,కరుణ,పోషణ,లాలన - పాలన, సంస్కరణ - గారాబం - అన్నింటి సమన్వయ రూపంగా మాతా భగవతీదేవి ఆవిధంగా మనమధ్యకు వచ్చారు.

గాయత్రీ మహాశక్తి ఒక మంత్రంగా వేదాలలో వెలుగొందుతోంది. ఆమెను మాతృసత్తాగా మనం పరిగణిస్తే - ఆమెలో ఏయే గుణాలను చూస్తామో ఆయా గుణాలను మనం మాతాజీలో చూస్తాము.

'శ్రద్ధా, వివేకముల సంగమంగా యుగశక్తి అవతరిస్తోంది. ఇకముందు మనిషి సాధించవలసిన సంపద ఋతంభర ప్రజ్ఞ. ఆ ప్రజ్ఞలో వివేకము, శ్రద్ధల సముచిత సమన్వయం ఉంటుంది'-అని పరమపూజ్య గురుదేవులు వ్రాశారు (1979 ఆగస్టు ప్రజ్ఞావతార సంచిక). వివేకము,శ్రద్ధల సమ్మేళనం ఎక్కడ ఎంత జరిగితే అక్కడ అంతగా మహత్తు కనిపిస్తుంది. సామాన్య పరిస్థితులలో జన్మించిన వ్యక్తి సైతం ఆ గుణాలు పొందినపుడు చారిత్రక మహామానవుల పాత్రను నిర్వహిస్తాడు. విశ్వ నిర్మాణంలో చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహిస్తాడు.

పరమపూజ్య గురుదేవులు 'ప్రఖర ప్రజ్ఞ'గా వివేకానికీ, బుద్ధికీ పరమోత్కృష్ట ప్రతీకగా, అవతారమూర్తిగా మనమధ్యకు వచ్చారు. ఈ ఇద్దరి సమన్విత కృషి ద్వారా ప్రజ్ఞావతారం అనే యుగాంతరీయ (యుగ పరివర్తన) చేతన జన్మించింది. మొట్టమొదట సత్‌సంస్కారాల జాగరణ, ఆతర్వాత సంకల్పశక్తి, సాధనా సమర్పణలద్వారా దేవ సంస్కృతి విస్తరణ కోసమై భగవద్గీతలోని 18 అధ్యాయములవలె 18 అశ్వమేధ యజ్ఞములను రెండు సంవత్సరాలలో ఆ చేతన నిర్వహించింది. శక్తియొక్క ప్రకటీకరణ ఇదే. అది మొదటి స్పష్టంగా కనబడదు. ఆ తర్వాత అది పెనుతుఫానులా విజృంభించి సూక్ష్మంలో విలీనం అవుతుంది. మరింత తీక్షణమై, మరింత సమర్థమై కానవస్తుంది.

పరమపూజ్య గురుదేవులు మాతాజీని 'సజల శ్రద్ధ'గా అభివర్ణించడంలోని ఆంతర్యం ఇదే.

★★★

**అంతఃకరణ భ్రష్టం అయినకొలదీ బుద్ధివైభవం సంకుచితం అవుతుంది.**

# విషయ సూచిక

ముఖ చిత్రం : కృష్ణలీల. -
విష్ణు స్వరూపములుగా మారిన గోవులు, గోపబాలురు.


1. **సంపాదకీయం :**
ఏ ఆదర్శాన్ని ఎన్నుకోవాలి 1
2. **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం**
శ్రీకృష్ణుని దివ్య వ్యక్తిత్వం 4
5. **అరవింద జయంతి వ్యాసం**
అరవిందుల ఆలీపూర్ 'ఆశ్రమవాసం' 7
6. **తులసీదాసు జయంతి వ్యాసం**
మహాకవి గోస్వామి తులసీదాసు 10
7. **శ్రావణి పర్వం సందేశం**
ఋషిత్వానికి ఆవాహన -
సర్వతోముఖ ప్రగతికి పిలుపు 18
8. **రక్షాబంధన్ కథ**
చరిత్రను తారుమారు చేసిన ఆ రక్షాబంధనం 20
9. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 3**
గాయత్రీ యోగానికి తాళపుచెవి -
గాయత్రీ మంజరి - 1 23
10. **ఉపాసన, సాధన, ఆరాధనల త్రివేణి - 2**
పరాజయం ఎరుగని సాధన 25
11. **దేవసంస్కృతి సౌరభం**
మన సాంస్కృతిక చరిత్రను పునర్నిర్మించుకుందాం 28
12. **దేవతా విజ్ఞానం**
దేవతలు పరమేశ్వరుని అలౌకిక శక్తులు 32
13. **ఆధ్యాత్మిక చికిత్స**
ప్రార్థనగా మారాలి ప్రతి పనీ 28
14. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 20**
'సైనిక' పత్రికకోసం హుంకారం 36
12. **నావారితో నామాట: మహోద్యమం విరాట్ యాత్ర-7**
స్వచ్ఛంద సంస్థలకు అగ్రగామిగా గాయత్రీ పరివార్ 41
13. **వార్తలు :**
హైదరాబాదులో జ్ఞానపరీక్ష
రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదానం 46


# చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను SRI VEDAMATHA GAYATRI TRUST - BUSI -DIVN - HYD పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము.

# ఆగస్టు, సెప్టెంబరు నెలలలో పర్వదినాలు

**ఆగస్టు :**

12. తులసీదాసు జయంతి.
15. స్వాతంత్ర్య దినోత్సవం.
అరవింద జయంతి.
19. రక్షాబంధన్, శ్రావణ పూర్ణిమ.
26. కృష్ణాష్టమి.

**సెప్టెంబరు :**

9. రాధాకృష్ణన్ జయంతి.
7. వినాయక చవితి.
15. వామన జయంతి.
17. విశ్వకర్మ జయంతి.
20. ఉండ్రాళ్ల తద్దె.
21. మాతాజీ జయంతి.
25. భాయి పరమానంద బలిదానం.

**మార్గం కష్టదాయకం కాకపోతే, ఆ లక్ష్యం ఉన్నతం కావడం అనుమానాస్పదమే.**

# వేద మంత్రం

*వి మే కర్ణా పతయతో వి చక్షుర్వీదం జ్యోతిర్హృదయ అహితం యత్ ।*
*వి మే మనశ్చరతి దూర ఆధీః కిం స్విద్వక్ష్యామి కిము మా మనిష్యే ॥*

– ఋగ్వేద 6/9/16

**భావార్థం** : మనుష్యుని ఇంద్రియాలు ఒకేదిశలో స్థిరంగా ఉండవు. అవకాశం దొరికితే చాలు, విషయాలవైపు పరుగు పెడతాయి. ఇంద్రియాల విషయ లోలత్వం పట్ల మనుష్యుడు ఎల్లప్పుడూ సావధానంగా ఉండాలి.

**సందేశం** : మనోనిగ్రహం అందరికీ అవసరం. ఆత్మోన్నతి కోరే ప్రతివ్యక్తికి దీనితో గాఢ సంబంధం ఉన్నది. ఆంతరంగిక జీవితాన్ని నియంత్రించుకొనుటకు, ధార్మిక వ్యవహారాలలో సాఫల్యానికి ఈ సమస్యను ఎదుర్కొనక తప్పదు. దీనిని నియంత్రించకుండా వ్యక్తి వికాసం సమాజ వికాసం వంటి పునాది పని చక్కగా నెరవేరదు.

ధార్మికరంగంలో మనస్సును ఏకాగ్రంగా ఉంచటం చాలా కష్ట సాధ్యమైన పని. కళ్లు మూసుకుని జపము లేదా ధ్యానానికి కూర్చోగానే అన్ని ఇంద్రియాలు తిరుగుబాటు చేయుటకు మొదలుపెడతాయి. కన్ను,చెవి,ముక్కు కొద్ది సంకేతం లభించగానే అటూ ఇటూ పరుగులుపెడతాయి. మనస్సు తన ఆలోచనల పాములపెట్టెను తెరచి కూర్చుంటుంది. భగవంతునిపేరు స్మరించటానికి కొద్దిగా కూడా ధ్యానం కుదరదు. వ్యవహారిక రంగంలో కూడా ఇదే పరిస్థితి. ఏ పనినీ పద్ధతి ప్రకారం చేయలేకపోతాము. మనస్సు నలువైపులా పరుగుపెడుతూ ఉంటుంది. పని చెడిపోతే దుఃఖమో, పశ్చాత్తాపమో కలుగుతుంటాయి.

భయం, వాసన, అపవిత్రత కారణంగా మనసు చంచలమవుతుంది. దీని వలన మన అంతఃకరణలో ఏకాగ్రతా, తన్మయత్వపు జ్యోతి ఊగిసలాడుతుంది, కంపిస్తుంది, ఆరిపోతుంది. మనస్సును భోగాలవైపు పరుగెత్తనిచ్చి, ఇంద్రియాలకు బానిసలై, ఆత్మయొక్క స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకొంటారు. ఇంద్రియ సంయమంతోకూడిన పవిత్రజీవనమే జీవన ముక్తిని ప్రదానం చేస్తుంది. ఆధ్యాత్మిక పోరాటం, ఒక కఠోర జీవనం. మనం ముక్తిని, నిర్భయత్వాన్ని కోరుకుంటాము. శరీరం, మనస్సుల పరిమితులను దాటి పోవాలనుకుంటాము కానీ ఎప్పటివరకు మన కోరికలకు, లాలసకు అతుక్కుపోయి ఉంటామో, అప్పటివరకు ఇది సంభవం కాదు.

మనస్సు యొక్క ఈ చాంచల్యాన్ని ఒక నియమిత దినచర్య పాలనద్వారా చాలా వరకు తగ్గించవచ్చు. ఒక పద్ధతి ప్రకారం ఆలోచించుట, దాని ప్రకారం పని చేయుట అలవాటు చేసుకోవాలి. వ్యక్తిత్వం యొక్క అన్ని అంగాలలో పూర్తి సామంజస్యం నెలకొనాలి. చిత్తశుద్ధి దీనికి ముఖ్యం. అన్నింటికంటే మొదట సంయమం ద్వారా ఎక్కువ మురికి పేరుకోకుండా చూడాలి. దానితో పాటు వివేకం ద్వారా పాత భ్రాంతులను, కల్మషాన్ని దూరం చేసుకోవాలి. చిత్తశుద్ధి ప్రక్రియ నిదానంగా జరుగుతుంది కానీ, అభ్యాసంతో సంభవమే.

మనోనిగ్రహం చాలా ఉత్సాహభరిత ఆంతరంగిక క్రీడ. ఓడించటం సంభవమేనా అనేది వదలిపెట్టి, ఒక క్రీడాకారునివలె ఈ క్రీడను ఆనందించాలి. ఈ క్రీడకు మనలో తగినంత కుశలత. సతర్కత, వినోదప్రియత్వము, సహృదయత, యుద్ధచాతుర్యం, నెమ్మది, శౌర్యం ఉండాలి. వందలాదిసార్లు ఓటమి తర్వాత కూడా మనలను విరిగిపోకుండా ఇది కాపాడుతుంది. ఇది ఆత్మబలం యొక్క చమత్కారం.

★★★

**ఇతరులను మోసగించగోరేవాడు నిజానికి తనను తాను మోసగించుకుంటాడు.**

ముఖచిత్ర కథనం - 1

# చల్లని జాబిలి వెలుగు - మాతాజీ మమత

## దేవుని వరం మాతాజీ

మాతాజీ భగవంతుని వరంగా మా జీవితంలోకి వచ్చింది. ఆమెను మినహాయించి మిషన్ ఉదయం గురించీ, విస్తరణ గురించి ఊహించడమే కష్టం.

గురుదేవులు చెప్పిన ఈ మాటలను బట్టి మాతాజీ పట్ల వారి దృక్పథాన్ని అంచనా వేయవచ్చు. అయితే ఈ వరం వారి జీవితంలోకి అకస్మాత్తుగా వచ్చిపడలేదు. కొన్ని సంవత్సరాలు ముందుగానే వారికి ఆ విషయం తెలుసు. వారి మార్గదర్శక సత్తా తాము ప్రథమ దర్శనం ఇచ్చిన రోజునే దీన్ని సూచిస్తూ ఇలా అన్నారు-

నీవు వివాహితుడవు అయినందుకు నాకు సంతోషంగా ఉంది. ఇందులో మధ్యలో అంతరాయం కలుగుతుంది. అయితే పూర్వ జన్మలలోని నీ సహచరి భార్య రూపంలో నీకు తిరిగి లభిస్తుంది. ఆమె జీవితమంతా నీకు తోడునీడగా ఉండి మహత్తర పాత్ర నిర్వహిస్తుంది. గత రెండు జన్మలలో నీవు గృహస్థుగా ఉన్నావు. గృహస్థుగా ఉండడంవల్ల పనికి ఇబ్బంది కలుగుతుందని భావించకు. నేటి పరిస్థితులలో అందువల్ల లభ్యమే కలుగుతుంది. యుగపరివర్తన కార్యంలో కూడ సహాయం అందుతుంది.' ("ఆత్మకథ"నుండి).

భగవానుని కృప, భగవానుని ఏర్పాటు - రెండూ ఒక్కటే. ఈ సత్యాన్ని కొద్దిమంది మాత్రమే అనుభూతి పొందుతారు. ఈ అనుభూతి తీపిగా ఉండవచ్చు. చేదుగానూ ఉండవచ్చు. ఎలా ఉన్నా - ఔషధంలా గుణమిస్తుంది. గురుదేవుల మొదటి భార్యమరణం భగవానుని తిరుగులేని ఏర్పాటువలె వారి జీవితంలో సంభవించింది. దాదాపు ఆ సమయంలోనే వారి పాత సహచరుడూ, మిషన్‌లో నిష్ఠావంతుడైన కార్యకర్తా అయిన బదరీప్రసాద్ పహాడియా భార్య కూడా మరణించింది. ఆయన ఆ సంగతి పూజ్యవరులకు ఉత్తరం వ్రాశారు. దాని జవాబిస్తూ పూజ్యవరులు ఇలా వ్రాశారు-

నీ భార్య చనిపోయిందని నీ ఉత్తరం ద్వారా తెలుసుకుని బాధపడ్డాను. దీనిని విధివిలాసంగా భావించి సహించు. ఇటీవలనే నా భార్య కూడా మరణించింది. ప్రస్తుతం మనం ఇద్దరం ఒకే విధమైన దుఃఖాన్ని భరించవలసి వస్తోంది. ముందుముందు నేను మళ్లీ పెళ్లి చేసుకుంటాను. ఎందుకంటే- మిషన్ భవిష్యత్తుతో అది ముడిపడి ఉంది. పైగా - మార్గదర్శక సత్తా ఆదేశంకూడా అలాగే ఉంది. కానీ, నీవు పెళ్లి చేసుకోకు".

## సర్వస్వాన్నీ అర్పించిన మాతాజీ

తమ గురుసత్తా ఇచ్చిన ఆదేశాన్ని శిరసావహించి, వారు మాతాజీని పెళ్లి చేసుకున్నారు. ఆరోజుల్లో వారికి ఊపిరి సలపని పనులు. తప్పించుకోలేని పనులు. స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనడం వల్ల బంధువర్గం బద్ధ విరోధి అయింది. 24 పురశ్చరణల ఉగ్ర తపస్సును కొందరు పిచ్చిపనిగా జమ కట్టారు. భావనాత్మకమైన ఆఘాతాలు అనేకం వచ్చిపడుతున్నాయి. చెదిరిన భావనలకు, అణిగిన భావనలకు మళ్లీ పోషణ అవసరం అయింది.

వచ్చిన వెంటనే మాతాజీ ఈ పనిని అద్భుతంగా నిర్వహించారు. గురుదేవుల మాటలలో-

'తన అణువణువునూ అర్పించే వ్రతాన్ని ఆమె వచ్చిన తొలి రోజునుంచే పాటించారు. వ్యతిరేకించే తత్వం ఆమెలో అసలు లేనేలేదు. ఆమె తలుచుకుంటే మామూలు స్త్రీలవలె రోజుకొక కొత్త కోరికతో నన్ను ఒత్తిడి చేయగలిగేది. అలా జరిగి ఉంటే - తపశ్చర్యా సాగేది కాదు, ప్రజాసేవకు అవకాశం లభించేదీ కాదు. ఇంతవరకు జరిగిన పని ఏదీ జరిగేదీ కాదు."

**గాయత్రి ప్రధాన లక్ష్యం సత్ ప్రేరణల, సత్ ప్రవృత్తుల అభివృద్ధి.**

## 'అఖండజ్యోతి పరివార్'

మాతాజీ వచ్చిన తర్వాత గురుదేవుల జీవన క్రమంలో కొత్త వెలుగు వచ్చింది. అఖండజ్యోతి ప్రచురణ అంతకుముందు నుంచే జరుగుతోంది. అయితే అంతవరకు అది ఒక పత్రికా ప్రచురణ మాత్రమే. మామూలుగా పత్రికకూ పాఠకునికీ మధ్య ఒప్పందం చదవడం, చదివించడంవరకే పరిమితం అవుతుంది. మాతాజీ రావడంతో - అఖండజ్యోతి పత్రిక 'అఖండ జ్యోతి పరివార్'గా రూపొందింది. పత్రిక పాఠకులు ఆమెకు ఆత్మీయులు అయినారు. ఈ క్రమంలో జనం వచ్చిపోయేవారు. ఉండేవారు. భోజనం చేసేవారు. కాలక్రమంలో వీరి సంఖ్య బాగా పెరిగింది. మాతాజీ వీరందరికీ తమ మమతను పంచేవారు.

రోజులలోఅఖండజ్యోతి పత్రికతో సన్నిహిత సంబంధం కలిగిన ఒక పరిజనుడు తన జ్ఞాపకాలను నెమరువేస్తూ పులకించిపోతూ ఇలా అన్నారు-

'ఆహా! ఎలాంటి రోజులు అవి! నేను అఖండజ్యోతిని అపుడే చదివాను. ఒకటి రెండునెలలు పత్రిక చదివిన తర్వాతఅనిపించింది - పత్రికలో వ్రాసే వ్యక్తి అద్భుతాలు చేస్తున్నాడు, ఆయనను కలుసుకోవాలి, అని. ఇంకేముంది. మథురకు బయలుదేరాను. అక్కడికి చేరేసరికి రాత్రి 11గంటలయింది. ఎలాగో ఇల్లు కనుక్కున్నాను. తలుపు తట్టడానికి తటపటాయించాను. ఇంత రాత్రివేళ పరిచయం లేని వ్యక్తి ఇంటి తలుపు తట్టడం బాగుంటుందా. అయితే, నాకు మరోదారి లేకపోయింది. మథురలో నాకు మరొకరు ఎవరూ తెలియదు. ధైర్యంచేసి తలుపు తట్టాను. మాతాజీ తలుపు తెరిచారు. గురుదేవులు బయటకు వెళ్లారని అడిగిన మీదట తెలిసింది. వద్దని చెపుతున్నా - ఆమె రాత్రి పన్నెండు- పన్నెండున్నర గంటలకు పరాఠా, కూర తయారుచేసి తినిపించారు. తిన్నతర్వాత గ్లాసు పాలు ఇచ్చారు. మాతాజీ పంచిన ఆ మమతను స్మరిస్తూ రాత్రంతా గడిపాను. ఉదయం నిద్రలేచి తిరిగివెళ్లసాగాను. శరీరం వెళుతోంది. మనసు మాత్రం మాతాజీ వద్దనే మిగిలిపోయింది.

## సజల శ్రద్ధ

ఈ అనుభూతి ఎవరో ఒకరిది కాదు. వేలాదిమంది మాతాజీ మమతను పంచుకున్నారు. ఈ మమతా బంధమే మిషన్ విస్తరణకు కారణమయింది. కనుకనే గురుదేవులు ఇలా వ్రాశారు -

'మిషన్‌ను అభివృద్ధి చేయడంలో మాతాజీ మా ఎడమ భుజమో, కుడి భుజమో కాదు. ఆమె హృదయం పాత్ర నిర్వహించారు. ఆమె భావనల వ్యాప్తితో మిషన్ విస్తరించింది. ఇతరులవలెనే మేముకూడా ఆమె ప్రేమ వాత్సల్యాలు పొంది ధన్యులం అయినాము. లేకుంటే - ఇన్ని ఆటుపోటులనూ, ఎదురుదెబ్బలనూ తట్టుకోలేక మేము ఎపుడో ముక్కలైపోయేవాళ్లం, మసి అయిపోయేవాళ్లం.'

మరోచోట వారిలా వ్రాశారు-

'ఆమె భావమయి. వాత్సల్యం ఆమె కణకణంలో నిండిఉంది. మావలె మాటలు పేర్చడం ఆమెకు చేతకాకపోవచ్చు. కానీ, మమతను పంచి ఇవ్వడంలో ఆమె మాకన్నా చాలా ముందున్నారు. మాకన్నా బుద్ధి కుశలత ఆమెకు లేకపోవచ్చు. కానీ, మమత అనే పెట్టుబడి మావద్దకన్నా ఆమెవద్ద ఎన్నోరెట్లు హెచ్చుగా ఉంది. కనుకనే, మేము ఆమెను 'సజల శ్రద్ధ' అని పిలుస్తాము. మిషన్‌లోని ప్రతి పరిజనుడూ ఆమెను సజలశ్రద్ధగానే దర్శించాడు.'

## మాతాజీ చల్లని జాబిలి

ఈవిశ్వాసం ఆధారంగానే గురుదేవులు 1950లో 1961లో హెచ్చుసమయం హిమాలయంలో అజ్ఞాతవాసం చేశారు. తాము వెళ్లిన తర్వాత మాతాజీ మిషన్ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారనే భరోసా వారికి ఉంది. సరిగా అదే జరిగింది. ఆమె పరిజనులను కలుసుకున్నారు. ఉత్తరాలకు జవాబులు వ్రాశారు. వ్రాయించారు. పత్రికల సంపాదకత్వాన్నీ ప్రచురణనూ నిర్వహించారు. ఈ పనులన్నీ ఆమె ఒంటరిగా చేశారు. గురుదేవులు తిరిగి వచ్చేసరికి పని అంతా పూర్వంకన్నా మెరుగుగా ఉంది.

**గాయత్రీ మాతను శ్రద్ధగా ఆశ్రయించిన వ్యక్తి ఎన్నడూ నిరాశ చెందదు.**

పరిజనులు మాతాజీ గుణగణాలను అదేపనిగా పొగిడేవారు. వారిలో కొందరు ఇలా అనేవరకూ వెళ్లారు–

'గురుదేవులు మధ్యందిన మార్తాడులు. వారివైపు కన్నెత్తి చూడలేకపోయేవాళ్లం. మాతాజీ చంద్రునివలె చల్లనిది. సూర్యునినుండి శక్తిని పొందినప్పటికీ, దాని వేడిమిని తనలో జీర్ణించుకుని పిల్లలమైన మాకు చల్లని వెలుగు అందిస్తూ వచ్చారు'.

## అగ్నిపరీక్షలో విజయం

ఈమాటలన్నీ విని పూజ్యవరులు మరింతగా ఆనందించారు. రోజులు గడిచాయి. ఈలోగా హిమాలయంనుండి ఋషిసత్తా మూడవసారి పిలిచింది. ఈసారి తిరిగివచ్చే అవకాశాలు కనిపించలేదు. మాతాజీ మథుర వదిలి శాశ్వతంగా శాంతికుంజ్‌లో ఉండవలసివచ్చింది. అపుడు శాంతికుంజ్ ప్రాంతమంతా కారరడివి. పట్టణం వదలి అడవిలో నివసించడానికి ఎవరైనా ఇష్టపడవచ్చు. కానీ, పిల్లలపై గల వ్యామోహాన్ని వదులుకోవడం ఎంత కష్టమో మమత నిండిన మాతృ హృదయమే చెప్పగలుగుతుంది.

ఆ విపరీత పరిస్థితిని గురుదేవులు ఇలా వర్ణించారు–

'ఇది మాతాజీకి అగ్నిపరీక్ష. కుమార్తె శైల వివాహం జరిగి కొద్దిరోజులే అయింది. మృత్యుంజన వివాహం జరిగికూడా ఎక్కువరోజులు కాలేదు. ఆమె బంధువర్గం అంతా మథుర చుట్టుప్రక్కల ఉన్నారు. కొడుకు, కూతురు, కోడలు– వీరిపై గల మమకారాన్ని ఇంత తేలికగా వదులుకుని హరిద్వార్ అడవిలో ఉండడానికి ఆమె సిద్ధపడుతుందని నాకు నమ్మకం లేకపోయింది. నేను నా మనసులోని అపనమ్మకాన్ని మరుగుపరచి, శాంతికుంజ్‌లో తపసాధన విషయం ఆమెతో మాట్లాడాను. క్షణమైన ఆలస్యం చేయకుండా ఆమె వెంటనే అందుకు తయారయింది. సాహసంతో కూడిన ఈ సమర్పణ చూచి మాకు ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.'

విషయం శాంతికుంజ్‌లో ఉండడంవరకే పరిమితం కాలేదు. దానితోపాటు ఎన్నెన్నో బాధ్యతలు ఉన్నాయి. అవనిలో కఠోరమైన సాధనాత్మక ప్రక్రియలు కూడ ఉన్నాయి. వాటిని నిర్వహించడం అంత సులభం కాదు. అయితే, ఆమె కఠిన కార్యాలకోసమే జన్మించింది. గురుదేవులు ఈ విషయాన్ని ఇలా వర్ణించారు–

## బాధ్యతా నిర్వహణలో అద్భుత సాఫల్యం

'కార్య విభజనలో మాతాజీకి ఇతర బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆమె బంధుత్వరీత్యా మా ధర్మపత్నియే. కానీ, వాస్తవానికి ఇతరులను అభిమానించిన విధంగా మమ్మల్ని కూడ తల్లిలా అభిమానిస్తోంది. ఆమె మాత మమతను మా పరివార్ అంతకూ పంచగలిగింది. మేము లేని లోటు ఆత్మీయులెవరినీ ఇబ్బందిపెట్టకూడదు. స్నేహం అందనందువల్ల ఏ మొక్కా వాడిపోకూడదు. ఈ బాధ్యత ఆమెకు అప్పగించబడింది.

"మేము వెళ్లిన తర్వాత ఆమె హరిద్వార్ – ఋషికేశ్‌ల మధ్య సప్తఋషుల తపఃస్థలిలో, గంగానది ఏడుపాయలు ప్రవహిస్తూన్న స్థలంలో 'శాంతికుంజ్' అనే చిన్న ఆశ్రమంలో నివసిస్తుంది. మేము 24 లక్షల మహాపురశ్చరణలు 24 జరిపాము. ఆమె కూడ ఆ మహాపురశ్చరణలు జరపాలి. అఖండ ఘృతదీపం మథురనుండి ఆమెవద్దకే వెళుతుంది. తన తపోబలం ద్వారా ఆమె ప్రజల దుఃఖాలను తొలగిస్తుంది. మేము జీవితమంతా ఆ పనే చేశాము. మేము వెళ్లిన తర్వాత ఎవ్వరూ తాము నిస్సహాయులమని భావించకూడదు. మా బాల–పరివార్ సంరక్షణకై మేము మాతాజీని అప్పగించి వెళుతున్నాము. ఆమె తమ తపశ్చర్యను దిగువ మూడుపనులకూ ఖర్చుచేసి, మా పరంపరను కొనసాగించాలి– (1) నవ నిర్మాణ ఉద్యమానికి ప్రత్యక్షంగా మార్గదర్శనం చేయడం. (2) బుద్ధి పరమూ, సాధనాత్మకమూ అయిన మా సాఫల్యాలను ప్రజలకు తెలియజెప్పడం. (3) అఖండ దీపాన్నీ, గాయత్రీ పురశ్చరణ పరంపరను కొనసాగించడం. తర్వాత పీడితులకు సాయపడడం.'

మాతాజీ ఈ బాధ్యతను ఏవిధంగా నిర్వహించారో మనందరికీ తెలుసు. ఈ బాధ్యతల నిర్వహణ గురుదేవులు హిమాలయంనుండి తిరిగివచ్చిన తర్వాతకూడ సాగింది. 1990 వరకు కొనసాగింది.

★★★

**పంచుకుని తిను. అమూల్యమైన సేవా సహకారాల సంపదను అందుకో.**

# ముఖచిత్ర కథనం - 2

# మాతాజీ మమత పంట మహిళా జాగరణ

**గురుదేవులది మహిళా హృదయం**

మాతాజీ కేంద్రంగా మహిళా శక్తి వికాసం పొందుతుంది.

అన్న పరమపూజ్య గురుదేవుల మాటలు మాతాజీ కార్యకలాపాలలో సాకారం అయినాయి. కార్యరూపం ధరించాయి.

గురుదేవులు స్వయంగా మహిళల వేదనను సర్వాత్మనా అనుభూతి పొందారు. ఆ అనుభూతిని వారు ఇలా వ్యక్తం చేశారు–

'మా రూపం పురుష రూపంగా తయారుచేయ బడింది. ఎవరైనా చర్మం కోసి చూడగలిగితే – లోపల మహిళా హృదయం కనిపిస్తుంది. కరుణ, మమత, స్నేహం, ఆత్మీయతలను హిమాలయంలా నిరంతరం నింపుకుని గంగా యమునలుగా ప్రవహింపజేస్తూ ఉంటుంది. ఆ మహిళా హృదయం.'

వందనీయ మాతాజీ మహిళ అంతఃకరణనూ, మహిళ శరీరాన్నికూడ పొందారు. కనుక, ఆమె హృదయం శతాబ్దాలుగా దళితులూ, పీడితులూ అయిన మహిళలకు జీవన శాస్త్రం కావడం సహజమే. ఆమె గుండె చప్పుళ్లలో మనకు మేధాపరమైన విశ్లేషణలూ, వ్యాసావళులూ, వక్తృత్వపు ఆకర్షణలూ కనిపించకపోవచ్చు. అయితే ఆ చప్పుళ్లలోని ఆకులతనూ, ఆతురతనూ స్పర్శించిన ఏ మనస్సయినా మహిళా జాగరణ కోసం కృషి చేయాలనే ఆకాంక్షతో నిండిపోతుంది. అందుకోసం త్యాగాలు చేయాలనే సంకల్పం ఉదయిస్తుంది.

ఆమె ఆవేదనలనే నీరూ, ఎరువూ పొంది, నేడు యుగనిర్మాణ యోజన ప్రాంగణంలో మహిళా జాగరణ అనే వటవృక్షం ఫలించి పుష్పిస్తోంది. ఆ వటవృక్షపు నీడలో లక్షలాది మహిళలు సేదదీరుతున్నారు. ఈ వటవృక్షానికి బీజారోపణ జరిగినప్పటి కథ హృదయాలను కదిలిస్తుంది.

**మాతాజీ ఆశ్రమం ఫూల్‌వతికి**

మాతాజీ ఆవల్‌ఖేడానుండి మథుర వచ్చిన కొద్ది సంవత్సరాలకు జరిగిన సంఘటన. ఒకరోజున ఒక స్త్రీ వచ్చి, ఆమెను చుట్టుకుని ఏడవసాగింది. ఆమె కన్నీళ్లు ఆగడంలేదు. ఎంతగానో నచ్చజెప్పిన తర్వాత, బుజ్జగించిన తర్వాత ఆమె ఇలా అన్నది –

"నా బాధలనూ, నా వేదనలనూ మీరు తప్ప మరెవరు అర్థం చేసుకుంటారు?"

"అసలు నీ బాధ ఏమిటో చెప్పు. నీకు వచ్చిన కష్టం ఏమిటో చెప్పు."

– అన్నీ మాతాజీ మాటలలో ఒక మమత, ఒక ఓదార్పు కనిపించాయి. ఆ స్త్రీ తన కరుణామయ గాథను ఇలా వినిపించింది–

"నా పేరు ఫూల్‌వతి. నా భర్త నన్ను ఇంటినుంచి తరిమివేశాడు. పుట్టింటివారు నన్ను పోషించడానికి సిద్ధంగా లేరు. ఈ ప్రపంచంలో నాకు తోడూ,నీడా లేకుండా పోయాయి."

ఆ స్త్రీకి సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుంది. మరిన్ని ప్రశ్నలు అడిగిన మీదట ఇంకా వివరాలు తెలిశాయి. ఎక్కువ కట్నం తేలేదని ఆమె భర్త ఆమెను ఇంటినుంచి వెళ్లగొట్టాడు. పుట్టింటివాళ్లు ముఖం తప్పించారు. ఆడపిల్ల పరాయి ఇంటి చెత్త. బయటకు పారవేసిన చెత్తను లోపలికి తెచ్చుకోవడం తెలివితక్కువ. ఇదీ వారు చెప్పిన కారణం.

అయితే – మాతాజీకి ఆమె కష్టం తన కష్టంగా తోచింది. ఆమె ఆ స్త్రీకి అభయం ఇచ్చారు. ప్రేమతో తమవద్ద ఆశ్రయం ఇచ్చారు.కానీ, ఈ సంఘటన మాతాజీలో ఆలోచనలను రేకెత్తించింది. స్త్రీలకు ఇంత అన్యాయం ఎందుకు జరుగుతోంది? తల్లిదండ్రులు ఆడపిల్లను పరాయి ఇంటి చెత్తగా ఎందుకు భావిస్తున్నారు? ఆడపిల్లలను ఎందుకు చిన్నచూపు చూస్తున్నారు? భర్త దృష్టిలో స్త్రీ కామాగ్నిని చల్లార్చుకునేందుకు ఒక ఆటబొమ్మ నచ్చినంతవరకూ దానితో ఆడుకోవచ్చు. మొహం మొత్తితే బయట పారవేయవచ్చు. అత్తవారింటిలో ఆమెను ఒక దాసిగా చూస్తున్నారు. పగలూ రాత్రీ పని చేయించుకుంటారు. కాని ఆమెకు సౌకర్యాలు ఇవ్వరు. గౌరవం ఇవ్వరు.

మరోరోజున అలాంటి మరో స్త్రీ వచ్చింది. ఆమె పేరు ప్రేమవతీదేవి. ఆమె వయస్సు సుమారు ముప్పైసంవత్సరాలు. ఆమె వితంతువు. ఆమె దస్తూరీ చాలా బాగుంది. మాతాజీ ఆమెకు తపాలా విభాగం పని అప్పగించారు. ఆ పనిని ఆమె ఎంతో అందంగా,

**సన్మార్గంలో నడిపేదీ, వినియాన్ని గరపేదీ విద్య.**

ఎంతో నిష్టగా నిర్వహించింది.

వీరికితోడు మరో స్త్రీ వచ్చి చేరింది. ఆమె పేరు కౌసల్యాదేవి. ఆమె వయస్సు 50 సంవత్సరాలు ఉంటుంది. ఆమె లూథియానా నివాసి. ఆమె వంట చేయడంలో సాయపడేది. కౌసల్యవలెనే రతన్‌దేవి వచ్చిచేరింది. ఆమెది నేపాల్. ఆమె భర్త ఆమెను వదిలివేశాడు. వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయి.

మాతాజీ ఆశ్రయాన్ని పొందిన అయిదవ స్త్రీ నారాయణి.

## తొలి మహిళా మండలి స్థాపన

ఈ అయిదుగురు మహిళలతో మాతాజీ ఒక మహిళా మండలి స్థాపించారు. ఈ మొదటి మహిళా మండలితో మహిళా జాగరణ ఉద్యమం ప్రారంభమయింది. మాతాజీ ఈ అయిదుగురుకీ చదువు చెప్పారు. జీవన విద్య నేర్పారు. జీవిత సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో బోధించారు. స్వావలంబనను నేర్పారు.

విద్య, స్వావలంబన లోపించినందువల్లనే రకరకాల దురాచారాలు ప్రబలిపోయాయి. స్త్రీలను పంజరాలలో బంధించారు. ఇలా విశ్వజనని అబల స్థాయికి దిగజారిపోయింది. గడ్డు పరిస్థితులలో మహిళ తననూ, తన పిల్లలనూ పోషించుకోలేని పరిస్థితి దాపురించింది. మహిళ బ్రతుకు పరాధీనపు బ్రతుకు అయిపోయింది.

ఈ పరిస్థితి మారాలంటే మహిళలలో ఆత్మబలం మేలుకోవాలి. సమాజంలో మాతృశక్తి పట్ల గౌరవాదరాలు ఏర్పడాలి.

## మహిళలకు గాయత్రీజప అధికారం

గాయత్రీ తపోభూమి నిర్మాణంతోపాటు ఈ రెండు కార్యక్రమాలనూ ఉద్యమ స్థాయిలో చేపట్టారు. ఆత్మబలం కోసం సాధన అవసరం అవుతుంది. ఇందుకోసం మహిళలకు గాయత్రీ మంత్ర జపం చేసే అధికారం ఇవ్వబడింది. మొట్టమొదట మాతాజీ ఈ అధికారాన్ని వినియోగించుకున్నారు. ఆతర్వాత గురుదేవులతో పాటు దేశమంతటా పర్యటించి వేలాదిమంది మహిళలకు గాయత్రీ మంత్రదీక్ష ఇచ్చారు.

గాయత్రీ మంత్రం సవితా ఉపాసనకు మంత్రం. ఈ ఉపాసనకు వివిధ సంప్రదాయాలలో వివిధ పద్ధతులు ఉన్నాయి. మాతృశక్తి పట్ల ప్రజలలో భక్తిని మేలుకొలపడానికై ఈ ఉపాసనా విధానాన్ని ప్రవేశపెట్టాలని గురుదేవులు - మాతాజీలు సంకల్పించారు. ఈ లక్ష్యంతో గాయత్రీ మాత సాధన ప్రసారం జరిగింది. ఋషి యుగ్మం యొక్క తపస్సు ప్రభావం వల్ల గాయత్రీ శక్తి యుగశక్తిగా అవతరించింది. ఈ కార్యంలో అనేక ఆపదలు వచ్చిపడ్డాయి. పూజారులూ, ధర్మాచార్యులూ తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటన అవమానాలకు పరిమితం కాలేదు. హత్యా ప్రయత్నం సైతం జరిగింది. బలిదానమే లక్ష్యంగా ఉన్నవారిని ఈ ఆపదలు ఏమి చేస్తాయి?

## నారీ శక్తిస్వరూపిణీ

పెత్తందార్ల కుట్రల ఫలితంగా మహిళ స్థితి రెక్కలు తెగిన పక్షి స్థితిలా తయారయింది. అయితే, నేటి ఈ దురాచారాలకూ, ప్రాచీన భారతీయ సంస్కృతికీ ఎలాంటి సంబంధమూ లేదు. ప్రాచీన కాలంలో మహిళల పట్ల అపారమైన శ్రద్ధా, గౌరవాలు చూపబడేవి. నేడు మహిళకు అన్నివైపులా బంధనాలే. ఆ స్థితికీ, ఈ స్థితికీ స్వర్గ - నరకాలకూ, ఆకాశ - పాతాళాలకూ ఉన్నంత వ్యత్యాసం ఉంది.

వైదిక ఋషులు మహిళను పలువిధాలుగా కీర్తించారు. శాస్త్రకారులు ఇలా నిస్సంకోచంగా ప్రకటించారు-

**నారీ త్రైలోక్య జననీ నారీ త్రైలోక్య రూపిణీ ॥**
**నారీ త్రిభువనాధారా నారీ శక్తి స్వరూపిణీ ॥**

వైదిక భారతంలో మాతృరూపంలో పరమేశ్వరుణ్ణి ప్రతిష్ఠించడం ఇందుకు ప్రమాణం. ఋషులు మాతృశక్తి ఆరాధనకు విధి విధానాలను రూపొందించారు. బుద్ధి వివేకాలు కలిగిన మనిషి నాగరికత వైపు అడుగు వేసిననాడే - తాను ఎక్కడనుంచి ఉదయించననే ప్రశ్న మనిషి మెదడులో తలఎత్తింది. ఇక్కడనుండి మాతపట్ల శ్రద్ధాభావన ఉత్పన్నం అయింది. పరమేశ్వరుణ్ణి ఆదిజననిగా ఆరాధించడం ఆరంభమయింది. మన దేశం నుండి ప్రేరణ పొంది, ప్రపంచంలోని సంస్కృతులన్నీ మాతృశక్తి ఉపాసనను ఏదో ఒక రూపంలో ప్రారంభించాయి.

ఇటలీలో ఫార్చునా రూపంలో, రోమ్‌లో సైవేలే రూపంలో, గ్రీసులో హౌరా రూపంలో, మధ్య ప్రాచ్యంలో మాంట్ రూపంలో, ఉత్తరాఫ్రికాలో తివాయత్ రూపంలో, మెక్సికోలో ఏసిస్ రూపంలో, గ్రీసులో అనోన్కా రూపంలో, సిరియాలో అరంటేటే రూపంలో, అబిసీనియాలో ఆసార్ రూపంలో బాబిలన్‌లో లాయా రూపంలో, ఈజిప్టులో అయిసిస్ రూపంలో - ఇలా నారీ శక్తి ఆరాధించబడింది.

**చెడిపోయిన మనస్సే మనిషికి ప్రబల శత్రువు.**

## దేవకన్యా ప్రశిక్షణ విద్యాలయం స్థాపన

గాయత్రీ శక్తియొక్క ఉపాసనా క్రమం ప్రాచీనం అయిన దానిని నవీనం చేయడం మాత్రమే. మహిళా శక్తిని మహాశక్తిగా రూపొందించే ప్రక్రియ అది. గాయత్రీ సాధనతో ఆత్మబలాన్ని పొంది, మహిళలు సమాజంలో బహుముఖాలుగా వికాసం పొందాలి. ఈ లక్ష్యంతో శాంతికుంజ్ స్థాపన జరిగింది. గురుదేవుల మాటలలో –

'శాంతికుంజ్ స్థాపనలోని ముఖ్య ఉద్దేశ్యం మాతాజీ మార్గదర్శనంలో మహిళా జాగరణ ఉద్యమాన్ని ప్రారంభించి, తద్వారా మహిళాభ్యుదయానికై పలువిధములైన కార్యక్రమాలను విశ్వవ్యాప్తం చేయడం.'

శాంతికుంజ్‌ను స్థాపించిన వెనువెంటనే పూజ్య గురుదేవులు తపో సాధన కోసమై హిమాలయానికి వెళ్లారు. ఇక్కడ శాంతికుంజ్‌లో మాతాజీ మహిళాభ్యుదయం కోసం నిరంతర సాధన ప్రారంభించారు. ఈ సాధనలో ఎందరో కన్యలను భాగస్వాములను చేశారు. వీరి సంఖ్య క్రమంగా వందకు పెరిగింది. సాధనతో పాటు వీరికి సంగీతం, కర్మకాండ, పౌరోహిత్యం, వక్తృత్వం నేర్పే ఏర్పాటు చేశారు.

అపుడు శాంతికుంజ్ బాగా చిన్నది. రెండుమూడు గదులు ఉండేవి. చుట్టూ వన ప్రాంతం. ప్రక్కనే ప్రవహిస్తూన్న గంగ. మనోహరమైన వాతావరణం. కన్యల సంఖ్య పెరిగే కొలదీ కొత్త భవనాలు నిర్మాణం అవుతూ వచ్చాయి. ఆ తర్వాత గురుదేవులు తిరిగివచ్చిన అనంతరం దేవకన్యా ప్రశిక్షణ విద్యాలయం లాంఛనంగా ప్రారంభమయింది. ఆ విద్యాలయం అధిష్ఠాత్రి స్వయంగా మాతాజీయే.

## డా॥ చెన్నారెడ్డి ప్రశంస

ఈ విద్యాలయంలో శిక్షణ పొందిన కన్యలు దేశమంతటిలో కార్యక్రమాలు నిర్వహించి రికార్డు సృష్టించారు. 15-18 సంవత్సరాల వయస్సు గల ఈ కన్యల ఉపన్యాసాలు ప్రజలను ఆశ్చర్యచకితులను చేశాయి.

లక్నోలో అలాంటి కార్యక్రమం ఒకటి జరిగింది. నాటి ఉత్తరప్రదేశ్ గవర్నరు డా॥మర్రి చెన్నారెడ్డి ఆ కార్యక్రమానికి విచ్చేశారు. కార్యక్రమం తర్వాత ఆయన ఈ కన్యలను కలుసుకున్నారు. వివరాలు తెలుసుకుని ఇలా అన్నారు – 'మీ కార్యక్రమం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. మాతాజీనీ, గురూజీనీ కలుసుకోవడానికి శాంతికుంజ్ తప్పక వస్తాను.' ఆ తర్వాత ఆయన శాంతికుంజ్ వచ్చారు. మాతాజీని కలుసుకుని ఎంతో భావోద్వేంతో ఇలా అన్నారు–

'కన్యలకు ఇలా శిక్షణ ఇచ్చిన మీరు ధన్యులు. వైదిక సాహిత్యంలో ఘోషా, అపాలాల గురించి చదివాను. నేడు వారిని చూచాను.'

దీనితో పాటు మాతాజీ పూజ్య గురుదేవుల సంరక్షణలో మహిళా జాగరణ మహోద్యమాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో మాతాజీ ఇలా అన్నారు.

'మన మహిళా జాగరణ అర్థం సంవేదనల మేలుకొలుపు భావనల వికాసం. పాశ్చాత్య దేశాల మహిళా విముక్తి ఉద్యమం వంటిది కాదిది. ఆ ఉద్యమం ద్వారా మహిళలు పురుషులుగా మారడానికి ముందుకు వచ్చారు. పురుషులుగా మారడానికి ముందుకు వచ్చారు. పురుషులు ఇంతవరకు సృష్టించిన సమస్యలు చాలవా? పురుషులుగా మారి వీటిని పరిష్కరించలేము. ఇందుకోసం మహిళలు తమలో మాతృత్వాన్ని వికసింపజేసుకోవాలి.'

## చతుస్సూత్ర కార్యక్రమం

ఈ ఉద్యమం కార్యకలాపాలను మాతాజీ నాలుగు భాగాలుగా చేశారు – (1)సాహిత్య ప్రచురణ (2)మహిళా శిక్షణ శిబిరాలు (3)సంఘటనద్వారా సంఘశక్తి నిర్మాణం (4)నిర్మాణాత్మక కార్యక్రమాలను విస్తరణ.

మాతాజీ ప్రారంభించిన ఉద్యమం విశ్వమంతటికీ విస్తరించింది. ఆ విస్తరణ స్వరూపాన్ని దర్శిస్తే ఇలా అనిపిస్తుంది–

'మహిళ అంటే బ్రహ్మవిద్య. మహిళ అంటే శ్రద్ధ. మహిళ అంటే పవిత్రత. మహిళ అంటే కళ. మహిళ అంటే – ప్రపంచంలో సర్వశ్రేష్ఠంగా కనిపించేదంతా మహిళ కామధేనువు. మహిళ అన్నపూర్ణ. మహిళ సిద్ధి. మహిళ అంటే– మనిషిని అన్ని కొరతల నుండి, కష్టాలనుండి, సంక్షోభాలనుండి రక్షించే సామర్థ్యం కలిగిన శక్తిస్వరూపిణి. శ్రద్ధతో, సద్భావనలతో పెంచిపోషిస్తే – ఈ సోమలత విశ్వంలోని కణకణంలో స్వర్గమయ పరిస్థితిని నింపుతుంది.'

★★★

**గురువును అవహేళన చేసే అభ్యుదయం అంతా నశించిపోతుంది.**

## ముఖచిత్ర కథనం - 3

# మాతాజీ కురిపించిన వరాల జడివాన

*గురుదేవులు జీవించిన సమయంలోనూ, ఆతర్వాత మాతాజీ తపస్సూ, మాతాజీ ప్రాణం తమ పిల్లల గృహాలకు ఆశీస్సులుగా, వరాలుగా అందుతూ వచ్చాయి. ఆ ప్రక్రియ నేటికీ కొనసాగుతూనే ఉంది. శరీరంలో లేకున్నా మన మాతృసత్తా సూక్ష్మ రూపంలో గతంలోవలెనే క్రియాశీలంగా ఉంది. అలాంటి సంఘటనలు కొన్నింటిని దిగువ ఇస్తున్నాం. పరిజనులు వీటిని చదవాలి. తమ జీవితం, తమ కుటుంబం జీవితం వందనీయ మాతాజీ చీర కొంగు నీడలో సురక్షితంగా ఉన్నాయని తెలుసుకోవాలి.*

### కలలో కనిపించిన మాతాజీ

1991 ఆగస్టునెల నీ మీద అసత్య ఆరోపణలు వచ్చాయి. నేను తీవ్ర మనోవ్యధకు గురి అయ్యాను. నాగదిలో పార్వతీ పరమేశ్వరుల ఫోటో అమర్చి ఉంది. నేను ఆ ఫోటోముందు ఏడుస్తూ కూర్చున్నాను. ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయాను.

నిద్రలో కల వచ్చింది. నలువైపులా పచ్చదనం. ఒక పీఠంమీద ఆకుపచ్చ అంచు గల తెల్లచీర ధరించి మాత కూర్చొని ఉన్నారు. ఆమె కళ్లకు కళ్లజోడు ఉంది. నేను ఆమె ప్రక్కనుండి వెళుతున్నాను. ఆమె నన్ను పిలిచారు. నాతో ఇలా అన్నారు–

అమ్మాయి! రాత్రి నీవు నన్ను పదేపదే గుర్తు చేసుకున్నావు. ఇపుడు నా ప్రక్కనుండి వెళ్లిపోతున్నావు.

నేను ఆమె చరణాలు నమస్కరించడానికి వంగాను. ఆమె నన్ను అక్కున చేర్చుకున్నారు. ముద్దుచేశారు. పార్వతీ మాతాజీ అంటూ నేను ఆమెను అల్లుకుపోయాను. ఆమె నాపై మాతృవాత్సల్యం కురిపించారు.

ఈ కల వచ్చేవరకు నాకు శాంతికుంజ్ గురించి అసలు తెలియనే తెలియదు. ఈకల వచ్చిన తర్వాత కొద్దిరోజులకు కాన్పూరునుండి మా ఆడపడుచు, ఆమె భర్త వచ్చారు. వారిద్దరూ గాయత్రీ పరివార్ ప్రముఖ కార్యకర్తలు నన్ను శాంతికుంజ్ రమ్మని వారు పట్టుపట్టారు. నవరాత్రికి వస్తానని చెప్పాను.

అక్టోబరు నవరాత్రి శిబిరంకోసం నేను శాంతికుంజ్ వచ్చాను. మధ్యాహ్నం 12-3 గంటల మధ్య మాతాజీని కలుసుకోవడానికి వెళ్లాను. మాతాజీని చూచి నేను స్తంభించిపోయాను. ఆమెను ఎక్కడో చూచినట్లు అనిపించింది. బాగా ఆలోచించిన మీదట ఆ కల గుర్తువచ్చింది. మాతాజీ పార్వతీమాతయేనా - అని ఆలోచించసాగాను. నేను ఇలా ఆలోచనలో పడి ఉండడం చూచి మాతాజీ చిరునవ్వుతో ఇలా అన్నారు–

"అవును తల్లీ! నీ ఆలోచన సరైనదే. మా భక్తులకు ప్రేమ పంచి ఇవ్వడం కోసం మేము రాత్రిపూట వారి ఇళ్లకు వెళతాము."

ఆ మాటలు విని నేను భావోద్వేగంలో తలమునకలు అయినాను.

– శ్రీమతి లతాదుబే, మురాదాబాద్

### ప్రాణాలను రక్షించిన మాతాజీ

ఈ సంఘటనకు కొన్ని సంవత్సరాల పూర్వం వైద్య శాస్త్రంలో ఉన్నత విద్యకోసం నేను అమెరికా వెళ్లదలిచాను. ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయినాయి. గురుదేవ్ - మాతాజీల ఆసీస్సుల కోసం శాంతికుంజ్ వచ్చాను. గురుదేవులు ఎప్పటివలెనే నిగూఢంగా మాట్లాడారు. కాని మాతాజీ స్పష్టంగా ఇలా చెప్పారు–

నీవు విదేశాలకు వెళ్లడం మంచిదికాదు. నీవు విదేశాలకు వెళితే నిన్ను చూచుకోవడం సాధ్యపడదు.

చూచుకోవడం ఎందుకు? నేను చిన్నపిల్లవాణ్ణి కాను కదా– అన్న ప్రశ్న నా మనసులో తలెత్తింది. అయినా ఆదేశం ఆదేశమే కదా. మనసులో ఉన్న ప్రశ్నను మనసులోనే అణచివేశాను. అమెరికా వెళ్లే ఆలోచన అంతర్ధానం అయింది.

**ఎన్నడూ నిరాశ చెందనివాడే నిజమైన సాహసి.**

ఆ విషయం మరుగున పడింది. ఈలోగా నేను బి.హెచ్.ఈ.ఎల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా నాకు మంచి ఉద్యోగం లభించింది. హరిద్వార్‌లో వేశారు నన్ను.

భర్తతో, పిల్లవాడితో శాంతికుంజ్ వెళుతూ వస్తూ ఉండేవాడిని.

ఒకరోజున పిల్లవాడికోసం స్కూటర్ బొమ్మ తెచ్చాను. వాడు 8నెలల పిల్లవాడు. వాడు మాతాజీ ఎదుట ఆ బోమ్మతో ఆడుతున్నాడు. ఆ స్కూటర్‌కు కీ ఇస్తే కొంతదూరం వెళ్లి, ఆ తర్వాత పడిపోతోంది. మాతాజీ ఇదంతా చూస్తున్నారు. ఏదో ఆలోచిస్తూ నాతో అన్నారు– "నీవు హెల్మెట్ ఎందుకు కొనవు" అని.

మరునాడు మాతాజీ నచ్చచెపుతూ మళ్లీ అన్నారు – "నీవుకూడా స్కూటర్‌నుండి పడిపోవచ్చు. జాగ్రత్తగా ఉండు".

మూడురోజుల తర్వాత స్కూటర్‌ప్రమాదం జరిగంది. తలకు బలమైన దెబ్బ తగిలింది. దవుడ విరిగింది. శరీరమంతా బలమైన గాయాలతో నిండిపోయింది. బ్రతికి బయటపడే ఆశ ఏమాత్రం లేదు. మాతాజీ కృపవల్ల కొత్త జీవితం లభించింది.

ఇది ఎలా జరిగింది? ఇది డాక్టర్లకూ అర్థం కాలేదు. వైద్య శాస్త్రానికీ అర్థం కాలేదు. నేను స్వయంగా డాక్టరును కనుక నాకు ఆశ్చర్యం కలిగింది.

ఆరోజునుండీ వారు ప్రదానం చేసిన జీవితం వారికే అంకితం అయింది.

– అఖండజ్యోతి సంపాదకులు

## మాతాజీ ఆశీస్సులతో కుంభవృష్టి

చిత్రకూటంలో అశ్వమేధయజ్ఞం జరపాలని కార్యకర్తలంతా ఆలోచించాము. ఆలోచనను సంకల్పంగా మార్చడానికై మేము శాంతికుంజ్ వెళ్లాము. మా ఆలోచనను మాతాజీ ముందు పెట్టాము. మా సమస్యలను వివరిస్తూ ఇలా అన్నాము–మాతాజీ! మేము మీ చేతుల్లో తోలుబొమ్మలం. మీరు ఎలా ఆడిస్తే అలా ఆడతాం.

ఆశీస్సులు ఇస్తూ మాతాజీ ఇలా అన్నారు–

పిల్లలారా! మీరు చింతించవద్దు. ఇది పరమాత్మ పని. భగవంతుని పనిని భగవంతుడే స్వయంగా చేస్తాడు. పనికి నిమిత్తమాత్రులుగా ఉండే వ్యక్తులు కీర్తి గడిస్తారు.

మాతాజీ ఆశీస్సులుపొంది ధన్యులమై మేము తిరిగివెళ్లబోతున్నాము. అకస్మాత్తుగా మాకో విషయం తట్టింది. ఆ ప్రాంతంలో వర్షాలు లేవు. శీతాకాలం వచ్చేసింది. నీళ్లు లేకపోతే పంటలు పండవు. ఆ స్థితి ప్రజల సహకారం ఎలా అందుతుంది? ఈ విషయం మాతాజీతో చెప్పాము. ఆమె ఆలోచిస్తూ ఇలా అన్నారు. ఇపుడు వర్షం కురిస్తే ఎలా ఉంటుంది? అంతా సక్రమంగా జరుగుతుంది– అని మేమంతా అన్నాము. మాతాజీ అన్నారు – మంచిదే. అయితే ఇప్పుడే వర్షం కురిపిస్తాము.

ఈ వరం పొంది మేము ఆశ్చర్యచకితులం అయినాము. త్రోవలో ఇలా ఆలోచిస్తూ వెళుతున్నాము– మాతాజీకి ప్రకృతి శక్తులపై అదుపు ఉన్నదా? అలహాబాదు వరకు వచ్చేసరికి వర్షం ప్రారంభమయింది. కుండపోత వర్షం. మాతాజీ ఆశీస్సుగా పంపిన వర్షంతో ఆ ప్రాంతమంతా తడిసిపోయింది. మంచి పంట పండింది. ప్రజల సహకారం అందింది. ఈ అనుభవం పొందిన తర్వాత మాకు అనిపించింది–

శక్తుల మూలస్రోతస్సు ఆదిశక్తి మాతాజీ. ఆమె మానవ శరీరం ధరించి గురుదేవుల లీలలో సహకారం అందించారు. ఆమె కృపవల్ల అంతా సాధ్యమే.

– నిర్మల్ సింగ్, సత్‌నా

## ఆగిపోయిన వర్షం

బ్రిటన్ కార్యకర్తలను మేమంతా కలసి లెస్టర్‌లో 108 కుండముల యజ్ఞం ఏర్పాటు చేశాము. డా॥ప్రణవ్ పండ్యాజీ తమ సహచరులతో పాటు శాంతికుంజ్‌నుండి వస్తున్నారు. మేమంతా ముమ్మరంగా సన్నాహాలు చేశాము. కానీ, బ్రిటన్‌లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేము. వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేము. వాతావరణం చెడిపోతే – ఏ కార్యక్రమానికైనా హెచ్చు వాహనాలు రాకపోకలు సాగిస్తే, రోడ్లు పాడయిపోయే అవకాశం ఉంది. కనుకనే అక్కడ బీమా రుసుము 5000

**హృదయంలోని విషయాన్ని చెప్పని మాట ఒక దయ్యం.**

పౌండ్లు జమ చేయవలసి ఉంటుంది.

డా॥ ప్రణవ్ పండ్యాజీ బృందం సమయానికి చేరుకున్నారు. కానీ, మేము భయపడినట్టే జరిగింది. రాత్రినుండే కుండపోత వర్షం కురియసాగింది. ఇపుడేమి చేయాలి? మరునాడు ఉదయం కార్యక్రమం ఎలా జరపాలి. మేమంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నాము.

మేమంతా కలసి మాతాజీని ధ్యానం చేశాము. వర్షాన్ని ఎలాగైనా ఆపవలసిందని కేతర స్వరంతో ప్రార్థన చేశాము. వర్షం జోరు తగ్గింది. ఉదయం డా॥ ప్రణవ్ పండ్యాజీ ఫోన్‌లో మాతాజీతో మాట్లాడారు. పరిస్థితిని వివరించి వర్షం పూర్తిగా ఆగిపోవాలని కోరారు. మాతాజీ నవ్వుతూ ఫోన్‌లో ఇలా అన్నారు–

మీరు గాబరా పడకండి. అరగంట లోపల మబ్బులు చెదిరిపోయాయి.

సరిగా అరగంటలో తెరిపి ఇచ్చింది. యజ్ఞం రెండురోజులు జరిగింది. ఒక్కబొట్టు కూడ కురియలేదు. యజ్ఞం పూర్తయింది. గుడారాలనూ, షామియానాలనూ ఎత్తివేశాం. వెనువెంటనే కుండపోత వర్షం ప్రారంభమయింది. మూడురోజులు అలా వర్షం కురుస్తూనే ఉంది. అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

– చంద్రేశ్ జోషీ, లెస్టర్–బ్రిటన్

## సమస్యల విషవలయం నుండి విముక్తి

సమస్యల విషవలయంలో చిక్కుకున్న ఈ జీవితాన్ని భరించేదెలా? ఈ ప్రశ్నకు జవాబు వెదకుతూ వెదకుతూ అలసిపోయారు. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక సంఘర్షణల ఫలితంగా మానసిక ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయింది. నిద్రపట్టకపోవడం జబ్బు ప్రారంభమయింది. భిలైలో, గ్వాలియర్‌లో, ఇతర స్థలాలలో వైద్యం చేయించాను. ఫలితం శూన్యం. ఉద్రిక్తత మాత్రం పెరిగింది.

చివరికి మా తమ్ముడి సలహా మేరకు 1981 ఫిబ్రవరిలో శాంతికుంజ్ ఆశ్రమం చేరాను. వందనీయ మాతాజీకి నా సమస్య వినిపించాను. ఆమె భరోసా ఇస్తూ ఇలా అన్నారు.

నాయనా! చింతించకు. నాకొక మాతాజీ ఉన్నదని నీవు భావింతు. తల్లి ఉండగా పిల్లవాడు బాధపడవలసిన అవసరం ఏముంది? ఏదో తీయదనం ఉంది. ఏదో మహిమ ఉంది. మనస్సు గద్గదం అయింది.

నేను బయలుదేరేటపుడు మాతాజీ నాకు రక్షాకవచం, హవన భస్మం పొట్లం ఇచ్చారు. రక్షాకవచాన్ని మెడలో ధరించాను. హవన భస్మాన్ని రోజూ రాత్రి పడుకునే ముందు రాసుకున్నాను. రెండు సంవత్సరాల నిద్రలేమి రోగం రెండు రోజులలో నయమయింది. ఆరోగ్యంగా, ప్రసన్నంగా ఇంటికి తిరిగివచ్చాను.

ఆ తర్వాత క్రమక్రమంగా కుటుంబ, సామాజిక సమస్యలు పరిష్కారం అవుతూ వచ్చాయి. మాతాజీ మాటలు మా జీవితాలకు అండదండలు అయినాయి.

తల్లి ఉండగా పిల్లవాడు బాధపడవలసిన అవసరం ఏముంది?

అనే మాతాజీ మాటలు నేటికీ నా మనస్సులో మారుమ్రోగుతూనే ఉన్నాయి.

– శ్రీకిషన్ దేవాంగన్, బిలాసపూర్

## సూక్ష్మరూపంలో మాతాజీ

ఆశ్వయుజ నవరాత్రినుండి 40రోజులు లక్షంబావు గాయత్రీ మహామంత్రం అనుష్ఠానం జరుపుతానని నేను సంకల్పం చేశాను. అనుష్ఠానం ప్రారంభించే ముందు, సంరక్షణ కోసం దోషనివారణ కోసం మాతాజీకి ఉత్తరం వ్రాశాను. 40వ రోజున పూర్ణాహుతి సమయంలో వందనీయ మాతాజీ స్థూల శరీరంతో కాకున్నా సూక్ష్మ శరీరంతో అయినా పూజాపీఠం మీదకు విచ్చేయాలని ఆ ఉత్తరంలో మాతాజీని ప్రార్థించాను. సూక్ష్మరూపంలో తప్పక వస్తానని మాతాజీ జవాబు వ్రాశారు. నాకు మహదానందం కలిగింది. నా మనోబలం పెరిగింది. ఈ విషయం వారంపదిరోజులు గుర్తుంది. ఆ తర్వాత అనుష్ఠానపు దినచర్యలో తలమునకలు కావడంలో దాని సంగతి మరచిపోయాను.

**కర్మఫల వ్యవస్థ పట్ల అవిశ్వాసమే నాస్తికతకు గుర్తు.**

40వరోజున పూర్ణాహుతి. నేను సతీసమేతంగా గాయత్రీ మహామంత్ర ఆహులు వేస్తూ యజ్ఞం చేస్తున్నాను. మధ్యమధ్యలో గాయత్రీ మాతను ధ్యానిస్తూ కళ్లు మూసుకుంటున్నాను.

అకస్మాత్తుగా దృశ్యం మారిపోయింది. నేను గాయత్రిని ధ్యానం చేస్తున్నాను. కాని ఆమె స్థానంలో ఉదయిస్తూన్న సూర్యుని రంగుగల కాంతి వలయం మధ్య మాతాజీ కనిపిస్తున్నారు. పూజా వేదికపై ఉంచిన ఫోటోకు కొద్ది ఎగువన ఈ స్వరూపం కనిపిస్తోంది.

ఆతర్వాత అకస్మాత్తుగా గుండెచప్పుడు పెరగసాగింది. స్పృహ తప్పినట్లు అయింది. నేను ఏమి చేస్తున్నానో నాకు తెలియడం లేదు. నాకు తెలిసి నేను మంత్రోచ్చారణ చేస్తున్నాను. అయితే, మంత్రం ఎప్పుడు ప్రారంభం అవుతోందో ఎపుడు ప్రారంభం అవుతోందో ఎపుడు స్వాహా చెబుతున్నారో నాకు తెలియడంలేదు. స్వాహా చెప్పకముందే మూడునాలుగు ఆహుతులు వేశాను. నా భార్య గుర్తుచేసింది కూడా. కానీ నా పరిస్థితి విచిత్రంగా ఉంది. కొంతసేపటికి గుండె చప్పుడు తగ్గింది. నాకు స్పృహ వచ్చింది. క్రమంగా ఆ దృశ్యం కనుమరుగు అయింది.

యజ్ఞం పూర్తయింది. కన్యా భోజనం జరిగింది. తాను సూక్ష్మరూపంలో వస్తానని మాతాజీ వ్రాసిన సంగతి గుర్తువచ్చింది.

గాయత్రీ మాత, వందనీయ మాతాజీలు ఒకే మహాశక్తి యొక్క రెండు రూపాలని నాకపుడు తెలిసివచ్చింది.

పీతాంబర ప్రసాద్ శర్మ,పో.సాండా(మ.ప్ర)

## మాతాజీకి ఇది ఎలా తెలిసింది?

నా భార్య కడుపులో రాళ్లు ఏర్పడ్డాయి. డాక్టర్లు ఎక్స్‌రే తీసి, ఆపరేషన్ చేయాలని చెప్పారు. మేము శాంతికుంజ్ వెళ్లి గురుదేవులతో విషయం చెప్పాము. ఇదంతా నయమవుతుంది. మాతాజీ నుండి రక్షాకవచం తీసుకోండి– అని వారన్నారు.

శిబిరం పూర్తయిన తర్వాత వీడ్కోలు ఇచ్చేరోజు అది. మాతాజీ అందరికీ యజ్ఞభస్మం పొట్లాలు ఇస్తున్నారు. ఆ లైన్‌లో నిలబడి మేము ప్రణామం చేశాము. మాతాజీ మాకుకూడా భస్మం పొట్లం ఇచ్చారు. రక్షా కవచం తీసుకోవలసిందని గురుదేవులు చెప్పారని మేము మాతాజీకి చెప్పగా – భస్మంతోపాటు రక్షా కవచం ఉన్నది బాబూ, అని మాతాజీ అన్నారు. నేను పొట్లం విప్పి చూస్తే అందులో భస్మంతో పాటు రక్షాకవచం కూడ ఉంది.

మాతాజీ అందరికీ భస్మం మాత్రమే ఇస్తున్నారు. మరి నేను చెప్పకుండానే లైన్‌లో ఉన్న నాకొక్కడికే రక్షా కవచం కూడా ఇవ్వమని గురుదేవులు చెప్పినట్లు మాతాజీకి ఎలా తెలిసింది – అని నేను ఆలోచించసాగాను.

వాస్తవానికి గురుదేవులు, మాతాజీ ఇద్దరూ ఒక్కరేనని నాకు బాగా ఆలోచించిన మీదట అర్థమయింది.

రక్షాకవచం (తాయెత్తు) ధరించిన తర్వాత నా భార్య కడుపులో జబ్బు ఏదీ లేదని డాక్టరు చెప్పాడు.

–సత్యంసింగ్, సర్‌గుజా (మ.ప్ర)

## ఆగిపోయిన వడగళ్ల వాన

కెనడాలోని టోరంటో నగరంలో అశ్వమేధ యజ్ఞంకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. అకస్మాత్తుగా మబ్బులు ముసురుకోవడంతో, కార్యకర్తల ఉత్సాహం నీరుకారిపోయింది. రోజూ వర్షం కురుస్తోంది. కార్యక్రమాన్ని రద్దు చేసుకోవలసిందని టెంట్ హౌస్ యజమాని సలహా ఇచ్చాడు. సన్నాహాల కోసం శాంతికుంజ్ నుండి వచ్చిన జయంతీ భాయ్ ఆయనతో ఇలా అన్నారు– "మీరు కంగారు పడకండి. మా మాతాజీ వస్తారు. ఆవెంటనే వర్షం ఆగిపోతుంది.'

ఎవరో రావడానికీ, వర్షం ఆగిపోవడానికి సంబంధం ఏమిటి? – అని ఆయన జయంతీ భాయ్‌వైపు అపనమ్మకంగా చూస్తూ అన్నాడు.

అయితే భక్తుని గౌరవాన్ని భగవంతుడే కాపాడతాడు. డా॥ప్రణవ్‌పండ్యాజీ, శైలదీదీతో పాటు వందనీయ మాతాజీ కెనడా చేరారు. ఆమె విమానం నుంచి దిగగానే వర్షం ఆగిపోయింది. యజ్ఞం వైభవంగా జరుగుతోంది.

**మహోన్నతమైన ప్రేమలో ఇవ్వడం మాత్రమే ఉంటుంది.**

యజ్ఞం చివరిరోజున మధ్యాహ్నం రెండుగంటల నుండి వడగళ్లవాన కురుస్తుందని వాతావరణశాఖ ప్రకటించింది. కార్యకర్తలు ఆ సంగతి మాతాజీకి తెలిపారు. మీరు కంగారు పడకండి. మధ్యాహ్నం మూడుగంటల వరకు యజ్ఞం జరపండి – అని వారితో చెప్పారు.

ఆ ప్రకారం యజ్ఞం మూడుగంటలకు పూర్తయింది. భారత్‌కు తిరిగిరావడానికి మాతాజీ విమానంలో కూర్చున్నారు. విమానం ఎగిరిన తర్వాత వడగళ్లవాన ప్రారంభమయింది. 'టోరంటో విమానాశ్రయం నుండి నేడు బయలుదేరగలిగిన చివరి విమానం ఇది' – అని విమానం పైలెట్ యాత్రికులకు ప్రకటించాడు.

– జయంత్‌దేశాయ్, ప్రఫుల్ల దేశాయ్, టోరంటో

నా సన్నిహిత మిత్రుని కుమారునికి బ్లడ్‌కేన్సర్ వ్యాధి వచ్చింది. అతడిని టాటా కేన్సర్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. వ్యాధి థర్డ్ స్టేజ్(మూడవదశ)లో ఉన్నదనీ, చికిత్స చేసి ప్రయోజనం లేదనీ, పిల్లవాడు కొద్దిరోజుల్లో చనిపోతాడనీ అక్కడి నిపుణులు చెప్పారు. అంతా నిరాశ చెందారు.

శాంతికుంజ్‌కు వెళ్లవలసిందిగా నేను వారికి సలహా ఇచ్చాను. వారు శాంతికుంజ్ వెళ్లి పిల్లవాడి పరిస్థితిని మాతాజీకి వివరించారు. పిల్లవాడు. తల్లిదండ్రులు నిరాశతో కుంగిపోయి ఉన్నారు. వారి పరిస్థితిని చూచి మాతాజీలో కరుణ ఉప్పొంగింది. ఆమె కళ్లు కన్నీళ్లతో నిండాయి. గద్గద స్వరంతో మాతాజీ ఇలా అన్నారు–

నాయనా! నీవు ఎందుకు బాధపడతావు? నీ కుమారుని జబ్బు నయమవుతుంది. గాబరా పడవలసిన అవసరం లేదు.

అంతా ఇంటికి తిరిగివచ్చారు. పిల్లవాడి పరిస్థితి రోజురోజుకూ మెరుగుపడుతూ ఉండడం చూచి అంతా ఆశ్చర్యపోయారు. అతడిని తిరిగి టాటా కేన్సర్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అతడిని పరీక్ష చేసిన డాక్టర్లు విస్తుపోయారు. రోగం గుర్తు సైతం పిల్లవాడిలో లేదని వారు తేల్చి చెప్పారు.

మాత కరుణకు అసాధ్యం ఏముంది?

– శ్రీమతి ఆశాజ్ఞానీ, ముంబై

## మరణంతో మాయని మమత

నా కూతురు పెళ్లి గురించి నేను చాలా రోజులుగా ఆందోళన చెందుతున్నాను. మరోప్రక్క మాతాజీ శరీరాన్ని వదలివెళ్లిన వార్త అందింది. సర్వస్వం కోల్పోయిన అనుభూతి కలిగింది.

అమ్మాయికి ఒక పెళ్లి సంబంధం చూచాను. అంతా నిర్ణయం అయిన తర్వాత మగపెళ్లివారు వెనుకకు తగ్గారు. నా ఆందోళన పెరిగింది.

ఒకరోజు రాత్రి ఇదంతా ఆలోచిస్తూ నిద్రపోయాను. 'మాతాజీ, మీరు జీవించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. మీరొక్క మాట చెపితే, సమస్య పరిష్కారం అయిపోయేది' నిద్రపోయే ముందు ఇలా ఆలోచిస్తున్నాను.

నిద్రలో కల వచ్చింది. కలలో మాతాజీ ఇలా అన్నారు–

'నాయనా! నీవు ఎందుకు బాధపడుతున్నావు? నేను నా ఇష్టప్రకారం శరీరాన్ని వదిలాను. శరీరం వదలడం చనిపోవడం అని నీవు అనుకున్నావు. నేను ఎన్నడూ చనిపోను. మా పిల్లలకు మరింతగా ప్రేమను పంచుతాను. మీ అందరి సమస్యలనూ తీర్చే బాధ్యత, మీ అందరినీ రక్షించే బాధ్యత మాపై ఉన్నది. ఈ బాధ్యతను మేము గతంలోకన్నా మరింత సమర్థవంతంగా నిర్వహిస్తాము. మీ అమ్మాయి పెళ్లి ఆ పెళ్లికొడుకుతోనే శాంతికుంజ్‌లో జరుగుతుంది.'

మరునాడు పెళ్లికొడుకు తరఫువాళ్లు మా ఇంటికి వచ్చారు. చర్చించి, విషయాలన్నీ తేల్చుకున్నారు. అంతేకాదు. శాంతికుంజ్ వెళ్లి అక్కడ పెళ్లి చేయడానికి ఒప్పుకున్నారు.

శాంతికుంజ్‌లో ఆ పెళ్లి జరిగింది. డా॥ప్రణవ్ పండ్యాజీ, శైలదీదీల ద్వారా సూక్ష్మసత్తాల ఆశీస్సులు అందాయి.

మమత నిండిన మాతాజీ అండ ఆమె శరీరం వదలిన తర్వాత తగ్గలేదు. పెరిగింది. ఇందులో సందేహం లేదు.

– ఒక పరిజనుడు, కాన్పూరు.

★★★

**తన దోషాలను గుర్తించకపోవడాన్ని మించిన దోషం లేదు.**